# పెద్దప్రాణం ఎక్కడుండాలి?

రచన:
శ్రీమతి ఎస్. సి. సాయిలీల

"లక్ష్మీ! ఎక్కడున్నావ్? ఇలారా త్వరగా, అన్న భర్త కేకవిని పరుగెత్తుకుంటూ తోటలోకి వెళ్ళింది లక్ష్మి. ఎన్నిసార్లు చెప్పానలాపరుగెత్తవద్దని, నెలలు నిండాకకూడా ఆపరుగులేంటి? నెమ్మదిగా నడిచివెళ్ళు, వాడు పిలవడం అలాగే వుంది. నువ్వు వెళ్ళడం అంతకన్నా బావుంది'' అంటూన్న అత్తగారిమాటలకి నవ్వుకుంటూ పరుగులాంటినడకతో తోటలోకి ప్రవేశించింది. ఎర్రటిచీర, ఎర్రరవికె, రెండుచేతులనిండా ఎర్రటిగాజు గాజులతో, గాజుల ఘల్లుఘల్లుమనే శబ్దంతోపాటు, పాదాలకి పెట్టుకున్న గజ్జెలు వింతశబ్దం చేస్తుండగా మామిడిచెట్టు దగ్గరగా నిల్చున్న భర్తదగ్గరగా వెళ్ళింది. మామిడిచెట్టు కొమ్మమీద కోయిల కూర్చుని 'కూ, కూ' అంటోంది. ఆ 'కూ' శబ్దం చెవులకి మనోహరంగా వుంది. మామిడి, పనస, దానిమ్మ, బత్తాయి, నారింజ చెట్లతో నిండుగా వుందాతోట చూపరుల కళ్ళకి.

తోటలో ఒకపక్కగా పళ్ళచెట్లు, ఇంకొకపక్క పూల చెట్లు వేయించింది ఆ ఇంటి యజమానురాలు ఆండాళమ్మ. పూలు ప్రతిచెట్టుకి విరగబూసివున్నాయి. చామంతి, మల్లె, మందార మొదలైన పూలచెట్లని చూసుకుంటూ మామిడి చెట్టుపైకి చూస్తు భుజంమీద చెయ్యివేసి, 'అలా చూడు' అన్నట్లు చెట్టుపైకి చెయ్యిపెట్టి చూపించాడు.

సరిగ్గా చూపుడువేలు చూపించినచోట తల్లి చిలుక పిల్ల చిలుకనోట్లో ఏవో పళ్ళు తీసుకొచ్చి ఆహారం పెడ్తోంది. నెమ్మదిగా నోరుతెరిచి తింటూన్న పిల్లచిలుక ఎంతో ముద్దుగా వుంది. తన్మయంగా ఆ దృశ్యం చూస్తూ నిల్చుండి పోయింది లక్ష్మి. 'పూ, ఇంక ఆ పరవశంలో వున్నారు మేము కన్పిస్తామా? ఏది ఆచూపు మావైపుకూడా తిప్పండి శ్రీమతిగారూ!' అంటూ తనవైపు ముఖాన్ని తిప్పుకున్న భర్త ఘనశ్యామ్‌వైపు సిగ్గుగాచూసి, 'చాల్లెండి, ఎవరైనా పనివాళ్ళుచూస్తే ఏమనుకొంటారు?'

'ఓహో తమరేం తక్కువ తిన్నారా? ఇలా చూడండి, నా భుజంమీద చెయ్యివేసి ఎలా నిల్చున్నారో?' అన్నాడు. అప్పుడు చూసుకుంది లక్ష్మి తనని. భర్త భుజంమీద దర్జాగా చెయ్యివేసి చూస్తోంది తను. పమిట కొంచెం పక్కకి తొలగిపోయివుంది. 'అయ్యయ్యో! పాలేర్లు రామయ్యగాని, కోటీసుగాని చూసారేమో! రాను రాను చిన్నమ్మగారికి సిగ్గులేకుండా పోతోందని అనుకుంటారేమో!' అనుకుంటూ భుజంమీంచి చెయ్యి తీసివేసింది. 'పూ, ఎలా వుంది? ఈ కమనీయదృశ్యం. లక్ష్మి మాతృహృదయపు మమకారం చూడు! సృష్టిలో తల్లి ప్రేమకి ఎంత ప్రాముఖ్యమిచ్చాడా భగవంతుడు! రియల్లీ వండర్ కదా, ఈ సీను! మొదట నేనుచూసి నువ్వుచూస్తే ఇంకా సంతోషిస్తావని నిన్ను పిల్చాను.'

'నిజంగా నాకు చాలా ఆనందంగా వుందండీ. ఎంత ముద్దుగా తెరిచిందో చూడండి ఆ చిన్న చిలుకపిల్ల నోటిని!'

'రేపు నీ పాపాయికూడా ఇలాగే నోరుతెరిచి నీదగ్గర పాలు త్రాగుతుంది తెలుసా! అప్పుడు చూడండి ఎంత బుల్లి నోరో, ఎలా త్రాగుతున్నాడో అంటావు.'

సిగ్గుతో తనవైపుచూసి తల వంచుకున్న లక్ష్మివైపు అభిమానంగా చూసాడు. నెమ్మదిగా తనభార్య పొట్టమీద చెయ్యివేసాడు. లోపల ఏదో కదిలినట్లయింది. ఏదో గర్వంలాంటి భావం కల్గింది అతనిలో. తన ప్రతిరూపం తనభార్యలో పెరుగుతోందనే ఆలోచన రాగానే అతని మనస్సు హాయిగా అటూ, ఇటూ కాస్సేపు వూగింది. నెమ్మదిగా తలవంచి ఆ పొట్టమీద ముద్దు పెట్టుకున్నాడు. ఏదో అనిర్వచనీయమైనభావం కల్గింది లక్ష్మిలో.

'పెద్దమ్మగారు, లోపలికి రమ్మంటున్నారు చీకటి పడ్తోందని' పాలేరు పిలుపుతో లోపలికి నడిచారిద్దరూ. 'లక్ష్మి, నెలలు నిండాక చీకటిప్రదేశాలలో తిరగకూడదమ్మా. పురుగు పుట్రా వుంటుంది. ఏసమయానికి ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు చెప్పు? మనజాగ్రత్తలో మనం వుండాలి కాని' అంటూన్న అత్తగారితో 'నిజమే అత్తయ్యా, ఇంకెప్పుడూ మీ అబ్బాయి అలా తోటలోకి రమ్మని పిల్చినా వెళ్ళనులెండి' అంది లక్ష్మివైపు కోపంగా చూసాడు ఘనశ్యామ్.

* * *

ఆరాత్రి నిద్రపోదామని ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు లక్ష్మికి. తన చిన్నతనమంతా గుర్తుకు రాసాగింది నెమ్మదిగా. ఇద్దరు అబ్బాయిలతర్వాత పుట్టిన లక్ష్మికి గారాబం సాగింది చిన్నతనంలో ఎక్కువగా. హఠాత్తుగా తండ్రి హార్ట్ ఎటాక్‌వచ్చి పోవడంతో అంతవరకూ ఆనందంగా సాగుతున్న ఆకుటుంబపరిస్థితి తలక్రిందులైంది. తండ్రివైపు అన్నదమ్ములు నల్గురున్నా 'మాకెందుకుబాబూ, ఈ జంజాటమని' ఎవ్వరూ పట్టించుకోలేదు. తల్లివైపు ముగ్గురు తోడబుట్టినవాళ్ళు వున్న ఒకకుటుంబాన్ని పోషించే స్తోమతులేక వూరుకున్నారు చూస్తూ.


ముగ్గురుపిల్లలతో ఏదో కొద్దిపాటి ఆస్తితో లక్ష్మితల్లి వరలక్ష్మి గ్రామంనుంచి పట్నం వచ్చింది. పిల్లల్ని పెద్ద చదువులకి డబ్బు ఎక్కడినుంచి వస్తుంది? సుఖంగా గ్రామంలో గడిపిన వరలక్ష్మి అతి పొందికగా సంసారాన్ని నెట్టుకొచ్చి మొగపిల్లలిద్దర్ని బి.ఏల దాకా చదివించింది. 'అమ్మా నేను బి. ఏ. చదువుతానే' అంది లక్ష్మి ఎస్.ఎస్.ఎల్.సి. ప్యాసయ్యాక. 'వద్దమ్మా, మీకా తండ్రి లేరు. ఇట పైచదువులూ చదివించి అట కట్నమిచ్చి ఎలా పెళ్ళి చెయ్యగలను చెప్పు?' అన్న తల్లిమాటకి ఎదురు చెప్పలేక పోయింది.

* * *

గ్రామంలోని ఆండాళమ్మగార్కి ఒక్క కొడుకని, బి.ఎ. పాసై వ్యవసాయం చేసుకుంటున్నాడని, మంచి సంబంధమని చెప్పడానికొచ్చిన పెళ్ళిళ్ళ పేరయ్యతో 'నేను గ్రామంలో వుండను, నాకు పట్నవాసపు పెళ్ళికొడుకునే చూడండి' అంది లక్ష్మి. 'ఈకాలం పట్నవాసంలేదు, పల్లెటూరులేదు, పల్లెటూర్లలో పట్టణాలకన్న నాగరికత రోజురోజు ఎక్కువవుతోంది. పిల్లవాడిని చూసావంటే వొద్దనవా సంబంధాన్ని' అన్నాడాయన. నిజంగానే పెళ్ళికొడుకుని చూసిన లక్ష్మి కళ్ళార్పలేకపోయింది. అంత అందంగావున్న ఆతని పక్క తను తగననికూడా అనుకుంది. ఆండాళమ్మగారు ఏడువారాల నగలుపెట్టి తన కోడలిగా చేసుకుంది.

కానీ కట్నంలేకుండా, ఏం తీసుకోకుండా అత్తవారింట్లో అడుగుపెట్టిన లక్ష్మి ఆ ఇంటివైభవం చూసి ఆశ్చర్యపోయింది. కాలు క్రిందపెట్టకుండా రంగురంగుల తివాచీలతో అన్నిగదులూ అలంకరింపబడివున్నాయి. పట్నం ఇళ్ళకన్నా అందంగా తీర్చిదిద్దినట్లుగా వుందా ఇల్లు. ముఖ్యంగా లక్ష్మి నాకర్షించినది ఆ ఇంటితోట. ఇంటికి ఎటువంటి శోభని కలుగచేస్తే అందంగా వుంటుందో ఆవిధంగావుందా

THERE IS JOY
WHERE THERE IS
HIGH PRESSURE WATER SYSTEM





JOTHI
Engineering Works
Industrial Estate
MADURAI - 625 007.

ATHMAS

తోట. మొదటినుంచీ ప్రకృతి సౌందర్యమంటే ఇష్టపడే లక్ష్మి పెళ్ళయినకొత్తల్లో ఆ తోటలోనే గడిపింది. కోడలు పిల్ల నెల తప్పిందనితెలిసి ముద్దు ముచ్చటలు ఇంకా ఎక్కువ చేసింది ఆండాళమ్మగారు. ఆవిడకి ఒకడే కొడుకు. ఇంటాయన చిన్నప్పుడే పోయాడు. ఆస్తిని వృద్ధిచేసి కొడుకుని బి.ఏ. చదివించి పొలాలు, వ్యవసాయం అప్ప చెప్పింది.

ఇంట్లో సంతానం తిరగబోతోందని చుట్టుపక్కల ఇళ్ళకి కబురు చేరవేసారు పాలేర్లు, ఒకొక్కరే తెల్సిన ఆడవాళ్ళు కోడలు కోరికలేమిటో తెల్సుకోవాలని వస్తూ పోతూ వుండే వాళ్ళు. ఒకామె జంతికలు, ఇంకొకామె మైసూరుపాకు ఇలా వంతులవొప్పున రోజుకొక తినుబండారము తెచ్చి పెట్టేవాళ్ళు లక్ష్మి తినేంతవరకు. పుట్టింటివాళ్ళువచ్చి సూడిక లిచ్చి పురిటికి తీసుకెళ్తామని అన్నారు. అ పురుడేదో మేమే పోసుకుంటాము లక్ష్మినివిడిచి వుండలేమన్నారు అత్తగారు, భర్తాను. నాటుమంత్రసానులు, గ్రామంలో పురుడేమిటని? పంపించమని దెబ్బలాడారు లక్ష్మి వదినలు. పట్టణంనుంచి




లేడీడాక్టరుని రప్పిస్తానని పురుటికి లేడీడాక్టర్ని రప్పించి పురుడు పోసారు. కన్న కూతురికన్న ఎక్కువగా చూసు కుంటున్న ఆండాళమ్మగారి ఆప్యాయతచూసి వరలక్ష్మి చాలా ఆనందించింది. మనుమడి బారసాల ఘనంగా జరి పించడం చూసిందావిడ. కొంతమంది ఆప్యాయత పైకి కన్పిస్తుంది. మరికొంతమంది ఆప్యాయత లోలోపల వుంటుంది, వాళ్ళు బయ పడరు సందర్భం వచ్చినప్పుడు కూడా! ఇలాంటివాళ్లే లక్ష్మి అన్నలిద్దరూ.

చెల్లెలిమీద అభిమానంవున్నా పైకి కనబర్చేవారు కారు, లోలోపల చెల్లెలి అదృష్టానికి ఆనందపడేవాళ్ళు, ముద్దులు మూటగట్టే మనుమడిని చూసుకుని మురిసిపోయింది నాయ నమ్మ. కొంచెం ఏడిస్తేచాలు ఎత్తుకుని దించేదికాదు. మూడోనెల పిల్లవాడికి రాగానే పుట్టింటికి తీసుకెళ్తామని పట్టుబట్టారు లక్ష్మి వదినలు, తల్లీను, పుట్టింటికి కొడుకుని తీసుకొని వెళ్ళిందిగాని లక్ష్మిమనసు అత్తింటిదగ్గరే వుంది ఆనెల్లాళ్ళూ. 'తను వొకచోట మనసొక చోట' అన్నట్లు క్షణ మొక యుగంలాగడిపి అత్తవారింటి కొచ్చింది. ఆనెల్లాళ్ళూ ఆండాళమ్మగారు, ఘనశ్యామ్ ఏదో వెలితిగా బాధపడ్డారు. పిల్లవాడికి తొమ్మిదోనెల రాగానే తనకి నెల తప్పిందని తెల్సుకుంది లక్ష్మి, బాధపడి మొహం చాటుచేసుకొని తిరుగుతున్న కోడలిని కోప్పడింది ఆండాళమ్మ. 'సంతానం ఆ భగవంతు డిస్తున్నాడుగాని నీచేతిలో ఏముంది? కావాలో అని చెట్టుకి పుట్టకి మొక్కుకున్నవాళ్ళకి పిల్లలు పుడ్తు న్నారా చెప్పు? సిరీ, సంపదా, సంతానం అందరూ కావా లంటే రావు' అంటూన్న అత్తగారివైపు జాలిగా ముఖం పెట్టి చూసింది.

ఇంట్లో పనిపాటలు చేసుకుంటూ దృఢంగా తిరుగుతున్న ఆండాళమ్మగారు హఠాత్తుగా ఒకరోజు నిద్రలో వేరేలోకం లోకి వెళ్ళిపోయారు, తల్లి మరణానికి తట్టుకోలేకపోయా డు ఘనశ్యామ్. నెలలు నిండిన లక్ష్మికి పిచ్చెక్కినట్ల యింది. పోయినవాళ్ళతో పోలేరుగదా ఈ మిగతాస్వజనం! కొన్నాళ్ళు ఏడ్చి, కొన్నాళ్ళు ఏడ్పు దిగమ్రింగి రోజులు గడుస్తున్నకొద్దీ పోయినవ్యక్తిని కొద్దికొద్దిగా మరువగలి గారు. తల్లికన్న ఎక్కువగా తనని ఆదరించిన అత్తగారు ఆఇంట్లో తిరగకపోవడంతో ఏం చేయాలో తోచలేదు లక్ష్మికి. తల్లీ, వదినలు పుట్టింటికి రమ్మన్న భర్తని విడిచి పెట్టి వెళ్ళలేకపోయింది. అతి కష్టంమీద పురుడు పోసుకుని బ్రతికి బయటపడింది. లక్ష్మికి తల్లి, వదినలు ఆడపిల్ల ఇంటికి లక్ష్మి, ఆడపిల్ల పుట్టేంతవరకు ఆగమని చెప్పినా

రేద్దరు మొగపిల్లలు చాలని పిల్లలు ఇక పుట్టకుండా ఆపరేషన్ చేయించుకొంది.

పెద్దవానికి ఐదేళ్ళురాగానే స్కూళ్ళో చేర్పించారు. కాన్వెంటు చదువులమీద మోజు పెరగసాగింది ఆగ్రామంలో, తెల్సినవాళ్ళందరూ ఒక్కొక్కరుగా నెమ్మదిగా పట్టణం చేరుకోసాగారు, ఒకరికి పుట్టింది బుద్ధి అర్ధరాత్రి అందరికీ పుట్టిందన్నట్లు ఘనశ్యామ్‌కి ఒకరోజు అనుకోకుండా పట్టణంలో పిల్లల్ని చదివించాలనే బుద్ధి పుట్టింది. ఆలోచన రావడమేమిటి? అమలులో పెట్టేసాడు. 'తాతలనాటి ఆస్తులన్నీ అమ్మి ఎందుకండీ మనం పట్నం చేరుకోవటం?' మనకిక్కడ ఏకొరతా లేదు. మంచినెయ్యి, కూరలు, పాలూ, పళ్ళూ ఒకటేమిటి? అన్నిసుఖాలు అనుభవిస్తున్నాం.

లంకంత ఇల్లు, చావడీ, మనకేమిటండీ ఆ ఇరుకుఇళ్ళల్లో వుండేఖర్మ! అంటూ ఎన్నోవిధాల బ్రతిమలాడి లక్ష్మి చెప్పింది. ఖర్మ అనుభవించేకాలం వచ్చినపుడు మంచి చెప్పినా చెవులకెక్కదు మరి! అలాగే అయింది ఘనశ్యామ్ పరిస్థితి, అయినకాడికి ఇల్లు, పొలం అమ్మేసి మద్రాసు చేరుకున్నారు. తెల్సినవాళ్ళద్వారా చిన్న ఇల్లు అద్దెకి తీసుకున్నారు. రెండుగదులు, ఒకవంటిల్లు, చిన్న బాత్‌రూమ్, లెట్రిన్‌వున్న చిన్న పోర్షనుకి మూడువందలు అద్దె ఇవ్వసాగాడు. కూర్చునితింటోంటే కొండలుకూడా తరిగిపోతాయన్నట్లు బ్యాంకిలోవేసిన డబ్బు నెలనెలా ఇంటి ఖర్చులకోసం తీసేసుకోసాగారు. 'అమ్మా! గడ్డపెరుగు వేసేదానివి. ఇదేంటమ్మా నీళ్ళమజ్జిగ పోస్తున్నావ్?' అడిగాడు చిన్నవాడు గోపీ. వాడికి పదేళ్ళుంటాయి. ఇంగ్లీషు మీడియంస్కూల్లో సిక్త్ స్టాండర్డ్‌లో చేరాడు ఆసంవత్సరమే. 'ఇదేం పల్లెటూరా? గడ్డపెరుగులు, మీగడలు రావడానికి, మద్రాసు తెలుసుకో! ఉన్నదానితో సరిపెట్టుకోవడం నేర్చుకో! అమ్మా, నాన్న ఎక్కడినుంచి తెస్తారనుకొన్నావ్ డబ్బు' తమ్ముడితో అంటూన్న మురళినిచూసి లక్ష్మి నిర్ఘాంతపోయింది. 'గోపికన్న కొంచెమేకదా పెద్దవాడు మురళి, వీడికింత లోకజ్ఞానం ఎక్కడినుంచి వచ్చిందబ్బా? ఫరవాలేదు నా కొడుకులు. పెద్దవాళ్ళయి మమ్మల్ని సుఖపెడ్తారు' అనుకుని మనస్సులో చాలా ఆనందించింది తల్లి,

మాతృ హృదయం మమకారం సముద్రపు లోతుకన్నా లోతైనది. ఆ ఆప్యాయత, ప్రేమలని ఎవరూ వెలకట్టలేరు, కట్టబోరు. ఇంట్లోకి కావలసిన సామాను వున్నా లేకపోయినా పప్పు, ఉప్పు ఎక్కడినుంచి తెచ్చేదో, పిల్లల్ని, భర్తని పస్తు పడుకోబెట్టకుండా చూసుకొనేదా ఇల్లాలు. తన ఇల్లాలు తిన్నదో, తినలేదో గమనిస్తున్న ఘనశ్యామ్ గుండె తరుక్కుపోయేది. "చిలక్కి చెప్పినట్లు చెప్పింది లక్ష్మి. ఎంతపని చేశాను." అనుకుని చేతులు కాలాకఆకులు పట్టుకున్నట్లు అంతా మునిగిపోయాక అప్పుడు బాధ పడసాగాడు. ఎదురింటి వెంకట్రామయ్య గారితో ఆలోచించి చిన్న కంపెనీలో ఉద్యోగంలో చేరాడు.





మా ప్రత్యేక తయారింపులు!!

* డి. ఆర్. ఫైన్
* బజాజ్ ఫైన్
* కూల్ టెక్స్
* సంగమ్ ఇంటర్‌లాక్
* టిప్‌టాప్
* కైరాజ్
* మాసీర్
* ఐలెట్
* కాపిటల్
* ఓపిక్
* కింగ్ కాంగ్
* రాకెట్

ఇవికాక * జెట్టీలు * లండన్ * స్ప్రింట్రా * బాబి అన్నిరకాల కలర్ షర్టులు మరియు ఫాన్సీరకాలు అన్ని ప్రముఖ బట్టల షాపులలోనూ దొరుకును.

BAJAJ KNITTERS - Lakshminagar - Tirupur-638 602.

పొలాల పనులు చూసుకునే తన భర్త ఈ పట్టణంలో పని చేస్తూ అలసిపోయి ఇంటికొచ్చి సేద తీర్చుకోవడం చూసి "మనకి కష్టకాలం దాపురించిదేమిటనుకొని" కుమిలి పోసాగింది తనలో. పెద్దవాడు మురళి టెన్త్‌పాసై ఇంటరికి వచ్చాడు. రెండోవాడు టెన్త్‌కి వచ్చాడు ఆయేడాదే! "పిల్లలు చేతికంది వస్తున్నారు. ఇంకా నయం ఆడపిల్లలు లేరు. వాళ్ళే వుండి వుంటే ఈపాటికి పెళ్ళి సంబధాలు వెతకాల్సివచ్చేది. గుడ్డిలో మెల్లకన్నట్లు కొంతలో కొంత నయం. వాళ్ళిద్దరూ డిగ్రీలు సంపాదించి ఉద్యోగాలు చేసి తండ్రిని సుఖ పెడ్తారు" ఇలా ఆలోచించ సాగింది లక్ష్మి మనసు.

* * *

కాలం ఎల్లప్పుడూ ఒక్కలాగా సాగదు. సుఖదుఃఖాలతో కలసిన జీవితమే మానవుని జీవితం. ధనవంతులుగాని, బీద వాళ్ళు గాని రోజులు సంతోషంగా గడుస్తున్నాయి మన కేమిటి? అనుకుంటారు. అంతే! చెట్టు విరిగి మీద పడినట్లు ప్రళయంలా వచ్చి పడ్తుంది. కాలం కలిసొస్తోంది, పిల్లలు చేత కందుతున్నారు పరవాలేదు అనుకుంటున్న సమయంలో ఘనశ్యామ్ లారీ క్రిందపడి యాక్సిడెంట్‌లో ప్రాణాలు విడిచాడు హఠాత్తుగా ఒకరోజు. పనికంటూ వెళ్ళిన భర్త ఏ మాటా, పలుకూ లేకుండా పరలోకం చేరుకున్నాడని తెలిసి కుమిలి కుమిలి ఏడ్చింది లక్ష్మి. నా భర్త లేందే నేను బ్రతకలేను, నేను ప్రాణత్యాగం చేస్తానని గొడవ చేసింది.

తల్లి పోయాక అన్నయ్య లిద్దరూ, వదినలిద్దరూ ఎక్కువగా రావడం మానేశారు లక్ష్మి దగ్గరికి. చిన్నతనలో సంసారాలు వేరు. వయస్సు వస్తున్నకొద్దీ సంసారతాపత్రయం వేరు. వాళ్ళవాళ్ళ కుటుంబాలు పెరుగుతున్న కొద్దీ వాళ్ళ బాధ్యతలు కూడా పెరుగుతాయి నిస్సందేహంగా! బండికి కట్టిన ఎద్దు కాలు చచ్చుబడటమో లేకపోతే వాతం కమ్మి హఠాత్తుగా చావడమో జరుగుతుంటుంది. ఇంకో ఎద్దుని ఏం చేసుకోవాలో తెలియక దీనికి తోడుగా మంచి ఎద్దు దొరకక, జత సరిగ్గా కుదరక వున్న ఒక్క ఎద్దునీ అప్పుడప్పుడు బండీవాడు అమ్మేస్తుంటాడు మంచి బేర మొస్తే! ఇలాగే అయింది లక్ష్మి పరిస్థితి! కుటుంబాన్ని ఈడ్చేవాడు పోగానే లక్ష్మి ఇంట్లో వంటకైనా పనికివస్తుందని బంధువులు చూడసాగారు. లక్ష్మి వప్పుకో లేదు.

"చూడమ్మా! నీ కొడుకులిద్దరూ ఆణిముత్యాలు. వాళ్ళ కోసమైనా నువ్వు గుండె రాయిచేసుకుని బ్రతకాలి తప్పదు. వాళ్ళని అలా గాలికొదిలేస్తావా చెప్పు? నీ భర్తతోపాటు నువ్వుకూడా పోతే ఆ పసివాళ్ళని చూసే దిక్కెవరు చెప్పు? వాళ్ళకి తల్లీ, తండ్రీ అన్నీ నువ్వే"! అంటూ చుట్టుప్రక్కల వాళ్ళు, వదినలిద్దరు, బంధువులు చెప్పగా చెప్పగా దుఃఖాన్ని దిగమింగి తిరిగి సంసార తాపత్రయంలో పడింది లక్ష్మి. తండ్రి వుండగా భయభక్తులువేరు, అవే తండ్రి పోయాక నెమ్మదిగా తగ్గుతాయి. అదే సృష్టిలోని విచిత్రం. తల్లి దైవం, తండ్రి ధనమన్నారు మన పెద్దలు. తల్లి చూపించేది ప్రేమతో కూడిన అభిమానం పిల్లల మీద. తండ్రి దగ్గరున్న భయం తల్లి దగ్గరుండదు. ఇందుకే కాబోలు! మురళీ, గోపీ నెమ్మదిగా తల్లిని లక్ష్యపెట్టడం మానేశారు. మేనమామ లంటూ రావడం మానేశారా ఇంటికి. వారి సంసార తాపత్రయంలో పడి ఒక్కగానొక్క చెల్లెల్ని మరిచిపోయా రెప్పుడో! మీ వదినలు రావడం మానేశారే" అని ఎవరైనా అడిగినా "ఒక్కళ్ళనని ఏం లాభం? మన బంగారం మంచిది కానప్పుడు! మా అన్నయ్యల కుండాలి నా మీద అభిమానం. పరాయి అమ్మ కన్న బిడ్డలు వాళ్ళ కెందుకుంటుంది నా మీద ప్రేమ! మా అన్నయ్యలకేలేంది

SNH
మీ కొరకు...
మేము
తయారిస్తున్నాము.
శ్రీ నిత్యా బనియన్లు
* బనియన్లు - జెట్టీలు
* ఫ్యాన్సీ కలర్ రకాలు
తయారించువారు :
**Sri Nithya Hosieries**
**11-C, Ramaiah Colony,**
**TIRUPUR-638 602**
**Stockists :-**
**G K Banians**
**Vastralatha, Vijayawada-520 031.**

అభిమానం, మిగతా వాళ్ళ దగ్గర్నుంచి నేనేమి ఆశించను?'' అంది లక్ష్మి అమ్మలక్కలతో.

తన అత్తవారింటి వైపు ఎవరూ లేక తన పుట్టింటి వారి రాక పోకలు లేక, తనకంటూ నెత్తిమీది గొడుగు లాంటి భర్త పోయాక తన జీవితం ఎలా గడుస్తుందో ముందు ముందనుకుంటూ దిగులుపడ సాగింది తనలో. పెద్ద కొడుకు మరళీ ఎలాగోలాగ కష్టపడి బి. ఏ. అయిందని పించాడు. క్యాడ్‌బరీస్ కంపెనీలో స్నేహితునిద్వారా సేల్స్ మాన్ ఉద్యోగం సంపాదించాడు. నెలకి ఇరవై రోజులు చుట్టుపక్కలవూళ్ళు క్యాంపువెళ్ళి వస్తూవుండేవాడు. చిన్న వాడు గోపి రెండు, మూడు దండయాత్రలుచేసి బి. కామ్ అయిందనిపించి ఉషా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు.

భర్త పోయినప్పుడుకాని ఆతర్వాతకాని తమ ముఖం చూడనిబంధువులు కొడుకులు ఉద్యోగాల్లో చేరారని తెల్సు కున్నారేమో! ఆడపిల్లల్ని ఇస్తా అంటూ రాసాగారు. 'ఇంతకాలం మేం బ్రతికివున్నామా లేదా? అనికూడా చూడని మీకు ఇప్పుడు మేము కన్పించామా?' అంటూ అడిగింది లక్ష్మి పెద్దన్నయ్యని. 'ఏదో, మాపిల్లలు, మా సంసారం, రోగాలు ఎక్కడ తీరుబాటు. పల్లెటూరునుంచి పట్నం రావడం సామాన్యమా! రైలుఖర్చులకే అవుతుంది మా పొలాలమీద వచ్చిన డబ్బంతా! ఒకఏడాది పండితే పొలం ఒకఏడాది పండక నానాబాధలు పడ్తున్నాం. మా ఇబ్బందులు నీకేం తెలుస్తాయి. నువ్వే నయం పట్నంలో ఇద్దరు కొడుకులతో గుట్టుగా సంసారాన్ని నెట్టుకొస్తున్నావు. మేము వున్నాం ఆరుగురుపిల్లలతో, అందులో నగ్గురు చినపిల్లలతో నానాగడ్డీ తింటున్నాం' ఏకధాటిగా వుపన్యాసం ఇస్తూ తన దేం తప్పులేదన్నట్లు మాట్లాడుతున్న పెద్దన్నయ్య వైపు 'నీ అవసరంవచ్చింది కాబట్టి వచ్చావు, లేకపోతే ముఖం చూస్తావా' అనుకుంది తనలో. మురళీకి తన పెద్ద న్నయ్యకూతురు వైదేహిని కోడలిగా చేసుకుంది లక్ష్మి. రెండోవాడికి తన మేనమామ మనుమరాలు వసంతిని చేసు కుంది. 'మీఇంట్లో పడే స్త్రీలు, మాఅమ్మాయి జన్మ ధన్య మవుతుంది. మాకష్టాలు గట్టెక్కుతాయని కాళ్ళా వేళ్ళాపడి మాటుమళ్ళూ పడేంతవరకు కాళ్ళ పట్టడానికి సిద్ధమైన వియ్యాలవారు కోడళ్ళు కాపరానికొచ్చాక ఇంటి ఛాయలకే రావడం మానేసారు. పెళ్ళి అయ్యేంతవరకూ ఒకవిధంగా, పెళ్ళి అయ్యాక ఇంకొకవిధంగా మారిన వియ్యాలవారిద్దర్నీ చూసి నవ్వుకుంది లక్ష్మి.

(సశేషం.)

## ★ కొన్ని నిజాలు ★

* విశదీకరించే శక్తి ఉన్నప్పుడే విమర్శించాలి.

* సందేశాలు ఇచ్చేముందు సందేహాలు తీర్చు కోవాలి.

* ప్రతీకారంతో ప్రియురాలి కాపురంలో చిచ్చుపెట్టేకన్నా త్యాగంతో ఆమె కాపు రాన్ని నిలబెట్టటము మంచిది.

* ఎంతమందిని ప్రేమించావన్నది కాదు. ఎంత మందిచేత ప్రేమింపబడ్డావన్నది ముఖ్యము.

* నీ జీవితం చిగురించని మోడైనపుడు నీ గతకాలపు జ్ఞాపకాలే నీకు తీపి గుర్తులు.

* ధనం లేకపోతే బాధపడకు, పదవి లేకపోతే బాధపడకు-కాని, కళాహృదయం లేకపోతే బాధపడు.

* ఎవరైనా మాట్లాడేటప్పుడు వారి ముఖ సౌందర్యాన్ని వారి పళ్లువరసని పరీక్షించే కన్నా, ఆ మాటలు వెనుకనున్న వారి హృదయాన్ని అర్థం చేసుకోటానికి ప్రయ త్నించండి.

* గతాన్ని తలుచుకొని బాధపడేకన్నా, మరిచిపోవడానికి మార్గం చూడడము మంచిది.

* ఆడవాళ్ళని అబలలన్నవాళ్ళు శుద్ధ మూర్ఖులు. కాని ఆడవాళ్ళ శక్తి ఆడవాళ్ళకే తెలి యదు.

* భగ్న ప్రేమికులకు ప్రతి ఋతువు గ్రీష్మ ఋతువే.

—భీశెట్టి రామకృష్ణ